క్లుప్తంగా

వడ్డీ మాఫీతో ఆస్తిపన్ను చెల్లింపు గడువు నేటితో ఆఖరు

రాజమహేంద్రవరం సిటీ: ఆస్తి పన్ను వడ్డీ మాఫీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన గడువు ఆదివారంతో ముగియనుందని, ఈ విషయాన్ని ఆస్తి పన్ను యజమానులు గమనించాలని నగర పాలక సంస్థ కమిషనర్ దినేష్‌కుమార్ శనివారం విజ్ఞప్తి చేశారు. ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి చెల్లించేవారు మొత్తం వడ్డీతో సహా చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఆదివారం సెలవు రోజు అయినప్పటికీ ఆస్తి పన్ను చెల్లింపుదారుల సౌకర్యం కోసం కౌంటర్లు తెలిచి ఉంటాయన్నారు. నగరపాలక సంస్థ కార్యాలయంతోపాటు అదనంగా మరికొన్ని కౌంటరులను సచివాలయాల్లో ఏర్పాటు చేశామన్నారు. వీఎల్ పురం(సచివాలయం-23), ప్రకాష్ నగర్ (సచివాలయం-14), సీతంపేట(సచివాలయం-81), కోటిపల్లి బస్టాండు(సచివాలయం-36), నారాయణపురం (సచివాలయం-3), బొగ్గులదిబ్బ (సచివాలయం-42), హౌసింగు బోర్డులోని పంచాయతీ ఆఫీసులలో ఏర్పాటు చేసిన కౌంటర్లనూ ఆస్తి పన్ను చెల్లించుకోవచ్చన్నారు.

ఉపాధ్యాయుడు తోట సేవలు ఆదర్శనీయం



తోట సత్యనారాయణ దంపతులను సత్కరిస్తున్న ఎంఈవోలు. చిత్రంలో ఉపాధ్యాయులు

కడియం: నిబద్ధతతో కూడిన ఉత్తమ ఉపాధ్యాయుడు తోట సత్యనారాయణ సేవలు ఎందరికో స్ఫూర్తిదాయకమని ఎంఈవోలు మణికుమార్, వై.నాగేశ్వర్ పేర్కొన్నారు. మేకల దిబ్బ ఎంపీపీస్ 4 స్కూలు హెచ్ఎంగా పనిచేసి పదవీ విరమణ చేసిన సత్యనారాయణ అభినందన సభ శనివారం జరిగింది. కార్యక్రమంలో పాల్గొన్న ఎంఈవోలు మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి సత్యనారాయణ చేసిన సేవలను కొనియాడారు. ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఎం.లక్ష్మణరావు, దాసరి శివ, సబ్బతి శ్రీనివాస్, పారేపల్లి నరేష్, సబ్బతి అబ్బులు, వాడ్రేవు వరలక్ష్మి, చిలుకూరి శ్రీనివాస్, జయరాజ్, లక్ష్మణ్ కుమార్, విజయ కుమారి, ఎంఆర్సీ సిబ్బంది, సీఆర్ఎంటీలు పాల్గొన్నారు.

ఆచార్యులకు అక్షరాస్యత ఉద్యమమే అసలైన నివాళి



సభలో మాట్లాడుతున్న వక్తలు

కంబాలచెరువు: సమాజంలోని ప్రజలంతా అక్షరాస్యులు అయినప్పుడే ఆచార్యులు ఆశయాలను సాధించిన వారమవుతామని భద్రాచలం మాజీ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ మిడియం బాబూరావు అన్నారు. స్థానిక కోరుకొండ రోడ్డులోని యూటీఎఫ్ కార్యాలయంలో అక్షర దీక్ష ఆచార్యులు ఎంఏవీఎల్ఎన్ ఆచార్యులు 31వ వర్ధంతి సభ జనవిజ్ఞాన వేదిక, ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్, యూటీఎఫ్, ప్రజా సంఘాలు సంయుక్తం ఆధ్వర్యంలో శనివారం జరిగింది. ఈ సందర్భంగా ఆచార్యులు చిత్రపటానికి ఆయన కుటుంబ సభ్యులు, నాయకులు నివాళులు అర్పించారు. సభాధ్యక్షుడు ఎం.మల్లికార్జునరావు మాట్లాడుతూ ఆచార్యులు ఆశయ సాధన కోసం అందరూ పాటుపడాలన్నారు. మిడియం బాబూరావు మాట్లాడుతూ అక్షరాస్యత ఉద్యమం విజయవంతం చేయడంలో ఆచార్యులు పాత్ర మరువలేనిదన్నారు. డాక్టర్ చైతన్యశేఖర్, ఎస్.రవిబాబు, జేవీవీ నాయకులు తాతారావు, నిశ్చల్ యూటీఎఫ్ సహాధ్యక్షురాలు విజయగౌరీ, రూపస్ రావు, శ్రీమణి, పవన్, రాంబాబు పాల్గొన్నారు.

సారా తీసుకెళుతున్న వ్యక్తి అరెస్టు

కడియం: అక్రమంగా సారా రవాణా చేస్తున్న పిడింగొయ్యి గ్రామానికి చెందిన ఎర్ర గోవిందును అదుపులోకి తీసుకున్నట్టు కడియం పోలీస్ ఇన్‌స్పెక్టర్ బి.తులసీధర్ తెలిపారు. మోటారు సైకిల్‌పై 150 లీటర్ల సారా తరలిస్తున్నట్టుగా ఎస్ఐ టి.కృష్ణసాయి, సిబ్బంది కుమార్, రాహుల్ దాడి చేసి పట్టుకున్నారన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, కోర్టు ముందు హాజరు పర్చగా, నిందితుడికి రిమాండ్ విధించారని వివరించారు.

రోడ్డు ప్రమాదంలో ఇరువురికి గాయాలు

కొవ్వూరు: రోడ్డు కం రైల్ వంతెనపై మోటారు సైకిల్‌ను కారు ఢీకొట్టిన ప్రమాదంలో పట్టణానికి చెందిన కోటిచుక్కల సత్యనారాయణ అనే వ్యక్తితో పాటు మరో యువకుడు గాయపడ్డాడు. సత్యనారాయణ రాజమహేంద్రవరంలో స్టిక్కరింగ్ పనులు చేస్తుంటాడు. ఆయన శనివారం సాయంత్రం రాజమహేద్రవంలో పని ముగించుకుని ఇంటికి బయల్దేరాడు. మధ్యలో కోటిపల్లి బస్టాండ్ స్టాండ్ వద్ద ఒక యువకుడ్ని తన బైక్ ఎక్కించుకుని కొవ్వూరు వస్తుండగా వారిద్దరూ ప్రమాదానికి గురయ్యారు. క్షతగాత్రులు ఇద్దరినీ రాజమహేంద్రవరంలోని ఆసుపత్రికి తరలించారని కొవ్వూరు పట్టణ ఎస్సై మహ్మద్ జుబేర్ తెలిపారు.

ఆరోగ్యం.. ఆదాయం

- కూరగాయల వ్యర్థాలతో సేంద్రియ ఎరువు
- ఇంటిలోనే తయారు చేస్తున్న మహిళలు
- పెరటి కూరగాయల పెంపకం
- లాభాలు ఆర్జిస్తున్న గృహిణులు



సేంద్రియ ఎరువులను డబ్బాలో నిల్వ చేస్తున్న కార్పొరేషన్ సిబ్బంది

సీటీఆర్ఐ: ప్రస్తుతం నాణ్యమైన కూరగాయలు దొరకడం చాలా కష్టంగా మారింది. మార్కెట్‌లో లభ్యమవుతున్న కూరగాయలను రసాయన ఎరువులు వినియోగించి పండిస్తుండడంతో నాణ్యతను కోల్పోయి వాటిని తిన్న ప్రజలు అనారోగ్యంపాలవుతున్నారు. ఎక్కువ ధర చెల్లించడానికి సిద్ధమైనా మంచి కూరగాయలు లభించని పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో చాలా మంది తమ ఇళ్లపై, పెరట్లో కూరగాయలను పెంచుకుంటున్నారు. వివిధ మొక్కలు, పాదులు పెట్టి వాటిని శ్రద్ధగా చూస్తున్నారు. అయితే వాటిని ఎంత జాగ్రత్తగా పెంచినా ఎరువులు వేయకుంటే పోషకాలు సక్రమంగా అందవు. దీంతో సేంద్రియ ఎరువు తయారీకి నగరపాలక సంస్థ చర్యలు తీసుకుంది. రోజూ ఇంట్లో ఉపయోగించే కూరగాయాల వ్యర్థాలతో ఎరువు తయారు చేసేలా శిక్షణ ఇచ్చింది. దీనివల్ల మొక్కలు పెంచడానికి అవసరమైన ఎరువును ఎవరికి వారే ఇళ్లలో తయారు చేసుకోవచ్చు.

సేంద్రియ ఎరువుల తయారీపై శిక్షణ

వ్యాపారం చేయాలంటే ముందుగా కొంత పెట్టుబడి పెట్టాల్సి ఉంటుంది. తీరా పెట్టిన తరువాత ఆ డబ్బు తిరిగి వస్తుందన్న గ్యారెంటీ ఉండదు. అందుకే పెట్టుబడి లేని ఆదాయాల కోసం మహిళలు ఇప్పుడు ఇంటి ఆవరణలోనే గార్డినింగ్ ద్వారా కూరగాయలు, ఆకుకూరలు పండించి వాటిని వినియోగించుకోగా మిగిలినవి ఇతరులకు అమ్ముతున్నారు. ఈ కూరగాయలు పండించడానికి సేంద్రియ ఎరువులు అవసరమవుతాయి. అయితే వీటిని కొనుగోలు చేయడానికి కొంత సొమ్ము ఖర్చు చేయాల్సి వస్తోంది. దీని కోసం కార్పొరేషన్ విన్నుతంగా ఒక పథకాన్ని ప్రవేశపెట్టింది. ఇంటిలో వ్యర్థ పదార్థాలు ద్వారా ఖర్చు లేకుండా సేంద్రియ ఎరువులు తయారు చేసుకోనేలా మహిళలకు శిక్షణ తరుగతులను నిర్వహిస్తోంది. శిక్షణ పొందిన మహిళలు ఇంటిలోనే హోం కంపోస్టుని తయారు చేసుకుంటున్నారు. వీటిని వారు వినియోగించుకోగా మిగిలిన వాటిని నర్సరీలకు తదితర వాటికి విక్రయించి ఆదాయం సమకూర్చుకుంటున్నారు. అలా నగర పరిధిలోని సుమారు 5 వేల కుటుంబాలను సెలక్ట్ చేసి వారికి సేంద్రియ ఎరువుల తయారీపై శిక్షణ ఇచ్చారు.



ఇంటి వద్ద పెంచిన మొక్కలు



ఇంటి వద్ద సేంద్రియ ఎరువు తయారీ

మంచి దిగుబడి, ఆదాయం

సేంద్రియ ఎరువులు తయారు చేసుకుని వాటిని పేరటి మొక్కలకు వాడడం వల్ల మంచి దిగుబడి లభిస్తోంది. అంతేకాకుండా ఆరోగ్యకర పంటలు అందుతున్నాయి. మహిళలు తమ ఇంటి పరిసరాలలో వారి తయారు చేసిన సేంద్రియ ఎరువులను ఉపయోగించి ఇంటి పేరటిలో మొక్కలు పెంచుతున్నారు. వాటి ద్వారా కూరగాయలు లభిస్తుండడంతో వారు వినియోగించుకోగా మిగిలినవి ఇతరులకు విక్రయిస్తున్నారు. దీనివల్ల వారికి ఆదాయం చేకూరుతోంది. సేంద్రియ ఎరువులు తయారు చేసే విధానం సులవు. అందుకే మహిళలు ఆసక్తి చూపుతున్నారు.

– శ్రీనివాస్, శానిటరీ సూపర్‌వైజర్, కార్పొరేషన్

ప్రస్తుతం 5 వేల కుటుంబాల వారు సేంద్రియ ఎరువును తయారు చేసుకుని వాడుకుంటున్నారు.

కూరగాయలు పెంపకం..

ప్రతి ఒక్కరూ ఇప్పుడు మొక్కల పెంపకంపై ఆసక్తి కనబరుస్తున్నారు. ఇంటిలో ఏ మాత్రం ఖాళీ ప్రదేశం కనిపించిన అక్కడ మొక్కలు నాటుతున్నారు. అంతే కాకుండా గార్డెనింగ్‌లోనూ, డాబాపైన పూల మొక్కలు, వెజిటెబుల్స్ వంటివి సొంతంగా పండించికుంటున్నారు. మహిళలు సేంద్రియ ఎరువులతో పండించిన కూరగాయలను వారే స్వయంగా విక్రయిస్తున్నారు.

తయారీ విధానం

వెజిటేబుల్ వేస్ట్, మిగిలిన అన్నం, తడి చెత్తను ఒక కుండలో కాని, బిన్‌లో వేసుకోవాలి. కుండకు లేదా బిన్‌కు అడుగున రంధ్రం చేయాలి. దీని ద్వారా చెత్తలోని తేమ బయటికి పోతుంది. ఇలా రోజూ ఇంటిలో మిగిలిన తడి చెత్తను ఆ కుండ లేదా బిన్‌లో వేసుకోవాలి. వాటి చుట్టూ కారం, పుసుపు చల్లాలి. దీని వల్ల చీమలు పట్టకుండా ఉంటాయి. నెల రోజులలో కంపోస్ట్ తయారువుతుంది.

పాఠశాల వార్షికోత్సవాలు ప్రగతికి సూచికలు



సాంస్కృతిక ప్రదర్శనలిస్తున్న విద్యార్థులు

కంబాలచెరువు: పాఠశాలల్లో నిర్వహించే వార్షికోత్సవాలు ప్రగతికి నివేదికలని అర్బన్ రేంజ్ డీఐ బి.దిలీప్‌కుమార్ అన్నారు. స్థానిక కోర్లమ్మపేట నున్న కుసుమ నాగన్న ప్రాథమిక పాఠశాల శనివారం జరిగిన వార్షికోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీఐ మాట్లాడుతూ ప్రాథమిక స్థాయి నుంచి విద్యార్థుల్లో పోటీతత్వాన్ని పెంచేలా ఈ పాఠశాలలో అన్ని కార్యక్రమాలు ఘనంగా నిర్వహిస్తున్నారన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలను అద్భుతంగా ప్రదర్శించిన చిన్నారులను అభినందించారు. ప్రధానోపాధ్యాయిని సేవా రాజ్యలక్ష్మి వార్షిక ప్రగతి నివేదిక అందజేశారు. కార్యక్రమంలో అర్బన్ ఎంఈవో-2 రమా రజని, గాడాల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయిని ఎస్ఎస్.జ్యోతికుమారి, బీవీవీఆర్ పద్మావతి, పేరెంట్ కమిటీ చైర్మన్ కె.వెంకట లక్ష్మి, సీతం పేట ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు చైతన్యకుమార్, తుమ్మలావ ప్రాథమిక పాఠశాల హెచ్ఎం గోపీ అప్పారావు, వార్డు పెద్దలు, పేరెంట్ కమిటీ సభ్యులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పేదల సొంతింటి కల నెరవేర్చాం

- ఇళ్ల పట్టాలను దొంగ పట్టాలన్నవాళ్లు మూర్ఖులు
- నిరాధార ఆరోపణలు చేసే వారికి ప్రజలే గుణపాఠం చెప్పాలి
- ఎంపీ భరత్ రామ్



క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్న ఎంపీ భరత్‌రామ్

రాజమహేంద్రవరం సిటీ : పేదల సొంతింటి కల నెరవేర్చాలనే తపనతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఇళ్ల స్థలాలు శాంక్షన్ చేసిన 25 వేల కుటుంబాలకు పట్టాలు పంపిణీ చేస్తే వాటిని దొంగ పట్టాలు, భోగస్ పట్టాలు అని టీడీపీ నేతలు నోటికొచ్చినట్టు ప్రచారం చేయడం మూర్ఖత్వానికి నిదర్శనమన్నారు. ఎంపీ, వైఎస్సార్ సీపీ సిటీ ఎమ్మెల్యే అభ్యర్థి మార్గాని భరత్‌రామ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం నగరంలోని 23వ డివిజన్‌లో క్షేత్రస్థాయి పర్యటన నిర్వహించిన ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాతూ ఆ ఇళ్ల స్థలాలు ఫేక్ అంటూ విమర్శలు చేస్తున్న టీడీపీ నాయకులు ధైర్యం ఉంటే నిరూపించాలని సవాల్ విసిరారు. అవి దొంగ పట్టాలని నిరూపిస్తే ఏ కేసుకైనా సిద్ధమేనని జైలుకు వెళ్లడానికి కూడా వెనుకాడనన్నారు. టీడీపీ అభ్యర్థి ఆదిరెడ్డి వాసు తల్లి మేయర్‌గా, తండ్రి ఎమ్మెల్సీగా, సతీమణి ఎమ్మెల్యేగా చేసిన 16 సంవత్సరాలలో ఒక్క అభివృద్ధి పని కూడా చేయలేదన్నారు. వారు చేసిన అభివృద్ధి పనులు ప్రజలకు ఒక్కటైనా చూపించాలన్నారు. అభివృద్ధి చేయలేదు, చేసిన తమపై తనపై బురద జల్లడమే పనిగా వాసు పెట్టుకున్నాడన్నారు. ఆదిరెడ్డి కుటుంబం వల్లే నగరం భ్రష్టు పట్టిపోయిందన్నారు. దశాబ్దన్నర కాలంగా నగరంలో ఎటువంటి అభివృద్ధీ జరగలేదన్నారు. ఎంపీగా నగరాన్ని అత్యద్భుతంగా తీర్చిదిద్దుతుంటే చూడలేక కడుపుమంటతో ఆరోపణలు చేస్తున్నారన్నారు. అభివృద్ధి పనుల పేరు చెప్పి 25 శాతం కమీషన్లు తీసుకుంటున్నానని వాసు, అతనితో పాటు టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు, కార్యకర్తలతో అదే పనిగా ప్రచారం చేస్తున్నారన్నారు.

ఆరోపణలు చేసిన ఆదిరెడ్డి వాసుపై పోలీసులకు ఫిర్యాదు చేసి, రూ.10 కోట్లకు పరువు నష్టం దావా వేసినట్టు తెలిపారు. ఇళ్ల స్థలాల విషయంలో రూ.313 కోట్ల రైతుల ఖాతాలలో వేయించానన్నారు. ప్రజాప్రతినిధి ఇంట్లో కూర్చుంటే ప్రజా సమస్యలు పరిష్కారం కావన్నారు. ఓట్ల కోసం ఆదిరెడ్డి కుటుంబంలా ప్రజలను నమ్మించి మోసం చేయడం తనకు చేతకాదన్నారు. ఆదిరెడ్డి కుటుంబం అధికారాన్ని అనుభవించారే కానీ నగరాభివృద్ధిని పూర్తిగా విస్మరించారన్నారు. సిటీ ఎమ్మెల్యేగా నన్ను గెలిపిస్తే విశ్వ నగరంగా ప్రపంచ పటంలో ఉండేలా అభివృద్ధి చేస్తానని ఎంపీ భరత్ రామ్ అన్నారు. ఎమ్మెల్యేగా గెలిచిన తరువాత సంవత్సరం సంవత్సరన్నర కాలంలో ఇళ్ల స్థలాలిచ్చిన లబ్దిదారులకు సొంతింటి కల నెరవేర్చే పూచీ తనదేనన్నారు. నగర వాసులకు 24 గంటలూ మంచి నీటి సరఫరా అందేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. చాలా ప్రాంతాలలో డ్రెయినేజీ సమస్యలు కనిపిస్తున్నాయని, వాటిని పూర్తిగా పరిష్కరిస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో రుడా చైర్మన్ రౌతు సూర్యప్రకాశరావు, 23వ డివిజన్ ఇన్‌చార్జి వాకచర్ల కృష్ణ, కొల్లేపల్లి శేషయ్య, పొలసానపల్లి హనుమంతరావు, కేఎల్ఎన్ బాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యంలో ఓటు అత్యంత కీలకం

డీఈవో వాసుదేవరావు



స్వీప్ కార్యక్రమంలో ప్లకార్డులు ప్రదర్శిస్తున్న విద్యాశాఖాధికారులు

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): ప్రజాస్వామ్యంలో ఓటు అత్యంత కీలకమైందని, ఓటు హక్కుని ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని జిల్లా పాఠశాల విద్యా శాఖాధికారి కె.వాసుదేవరావు అన్నారు. స్థానిక ఎస్‌కేవీటీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఓటు హక్కు, స్వీప్ కార్యక్రమంపై శనివారం జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. బలమైన ప్రజాస్వామ్యం కోసం ఎక్కువ భాగస్వామ్యాన్ని (సిస్టమాటిక్ వోటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్టోరల్ పార్టిసిపేషన్ ప్రోగ్రాం, స్వీప్) అని పిలుస్తారన్నారు. భారతదేశంలో ఓటరు అక్షరాస్యతను ప్రోత్సహించడానికి భారత ఎన్నికల సంఘం ప్రధాన కార్యక్రమం 2009 నుంచి ఈ కార్యక్రమం నిర్వహిస్తోందన్నారు. భారతదేశంలో నిజమైన భాగస్వామ్య ప్రజాస్వామ్యాన్ని నిర్మించడం, అర్హులైన పౌరులందరినీ ఓటు వేయమని ప్రోత్సహించడం, ఎన్నికల సమయంలో సమాచారంతో కూడిన నిర్ణయం తీసుకోవడం స్వీప్ ప్రాథమిక లక్ష్యమన్నారు. ఎలక్షన్ రోజున ప్రతి ఒక్కరూ ఓటు వేయాలన్నారు. కార్యక్రమంలో రాజమహేంద్రవరం డివిజన్ ఉప విద్యాశాఖాధికారి ఈవీబీఎస్ నారాయణ, అర్బన్ రేంజ్ డీఐ బి.దిలీప్ కుమార్, సమగ్ర శిక్షా ఐఈఆర్‌టీ కోఆర్డినేటర్ కనక బాబు, ఎస్‌కేవీటీ స్కూలు హెచ్ఎం ఎంవీఎం సుబ్రహ్మణ్యం, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ప్రత్యేకావసరాల పిల్లలకు సదరం క్యాంపు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): ప్రత్యేక అవసరాల పిల్లలకు ప్రభుత్వం ఎన్నో సౌకర్యాలు కలిగిస్తోందని జిల్లా పాఠశాల విద్యా శాఖాధికారి కె.వాసుదేవరావు అన్నారు. స్థానిక ఎస్‌కేవీటీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం దివ్యాంగులకు సమగ్ర శిక్షా, సహిత విద్య ఆధ్వర్యంలో ఉచిత ఉపకరణాల పంపిణీ నిర్ధారణ పరీక్షా శిబిరం నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా రాజమహేంద్రవరం అర్బన్, రూరల్, కడియం, అనపర్తి, బిక్కవోలు మండలాలకు దిన ప్రత్యేక అవసరాల పిల్లలు ఈ శిబిరానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా డీఈవో కె.వాసుదేవరావు మాట్లాడుతూ ప్రత్యేక అవరాలు గల విద్యార్థులకు మనం మానసిక స్థైర్యాన్ని ఇవ్వాలన్నారు. విద్యార్థుల దగ్గరకే వైద్యులు వచ్చి అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహించి వారికి పరికరాలను అందించేందుకు ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశారన్నారు. భవిత కేంద్రాల్లో వారికి ప్రత్యేక శిక్షణ పొందిన ఉపాధ్యాయులతో బోధన చేయిస్తున్నామన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు వారానికి 5 రోజులు ఉడకబెట్టిన కోడిగుడ్లు, మూడు రోజులు వేరు శనగ చిక్కీ, మూడు రోజులు రాగిజావ అందిస్తున్నామని, వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. రాజమహేంద్రవరం డివిజన్ ఉప విద్యా శాఖాధికారి ఈవీవీబీఎస్ నారాయణ మాట్లాడుతూ ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు ఏర్పాటు చేసిన ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. హాజరైన విద్యార్థులు, తల్లిదండ్రులకు భోజన సదుపాయాలు కల్పించారు. కార్యక్రమంలో ఇంక్లూజివ్ ఎడ్యుకేషన్ కో ఆర్డినేటర్ ఎస్.కనకబాబు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

స్నేహానికి మారు పేరు భవానీ శంకర్

నివాళులర్పించిన ఎంపీ భరత్‌రామ్



బూరాడ భవానీ శంకర్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న ఎంపీ మార్గాని భరత్‌రామ్, రుడా చైర్మన్ రౌతు సూర్యప్రకాశరావు

రాజమహేంద్రవరం సిటీ: స్నేహానికి, ఆప్యాయతకు మారు పేరు బూరాడ భవానీ శంకర్ నిలుస్తారని ఎంపీ, వైఎస్సార్‌సీపీ సిటీ ఎమ్మెల్యే అభ్యర్థి మార్గాని భరత్‌రామ్ అన్నారు. శనివారం నగరంలో వై.జంక్షన్ ఆనం రోటరీ హాల్‌లో నిర్వహించిన బూరాడ ప్రథమ వర్ధంతి కార్యక్రమంలో బూరాడ చిత్ర పటానికి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ తనకు అత్యంత సన్నిహితుడని, అనేక విషయాల్లో మంచి సలహాలిస్తూ ఒక సోదరుడిలా ప్రేమను పంచాడన్నారు. అంత చక్కని వ్యక్తిత్వం ఉన్న మంచి మనిషి బూరాడ శివైక్యం పొంది సంవత్సర కాలమైనా ఇంకా మన మధ్యనే, మనతోనే ఉన్న భావన కలుగుతోందన్నారు. ఆ భగవంతుడు బూరాడ కుటుంబ సభ్యులకు ధైర్యాన్ని, అన్ని విధాలా ఆదుకోవాలని మనస్ఫూర్తిగా ప్రార్థిస్తున్నానన్నారు. ఈ కార్యక్రమంలో రుడా చైర్మన్ రౌతు సూర్యప్రకాశరావు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, పాల్గొని నివాళులర్పించారు.

తొమ్మిది మంది వలంటీర్ల రాజీనామా

కడియం: మండలంలో తొమ్మిది మంది గ్రామ వలంటీర్లు వ్యక్తిగత కారణాల వల్ల రాజీనామా చేశారని ఎంపీడీవో జి.రాజ్‌మనోజ్ శనివారం ఒక ప్రకటన ద్వారా తెలిపారు. వీరిలో కడియం గ్రామానికి చెందిన బత్తిన శ్రీధర్, నాతి జోత్స్న, మేడిశెట్టి రామలక్ష్మి, వంతు సాయికుమార్, కడియం లక్ష్మమ్మ దుర్గ, కాసాని గౌతమి, వరదా సత్యసాయి శిరీష కడియం గ్రామానికి చెందిన వారన్నారు.

ఇద్దరు కడియపులంకకు చెందిన జి.దుర్గా మణికంఠ ప్రసాద్, వేమగిరికి చెందిన పలివెల నాగేశ్వరరావు ఉన్నారన్నారు. వ్యక్తిగత కారణాల వల్ల రాజీనామా చేసినట్లు వారు చెప్పినట్లు ఎంపీడీవో రాజ్ మనోజ్ వివరించారు.

ఉపాధి కూలీ మృతి

గోపాలపురం: మండలంలోని గోపవరం గ్రామంలో శనివారం సొంగ చంద్రమ్మ (62) అనే ఉపాధి కూలీ విధుల్లో ఉండగా మృతి చెందింది. అదే గ్రామానికి చెందిన చంద్రమ్మ ఉదయం ఉదయం ఉపాధి పనికి వెళ్లింది. పనులు చేస్తుండగా ఆమెకు ఒక్కసారిగా గుండెపోటు రావడంతో కుప్పకూలిపోయిందని ఉపాధి ఏపీఓ ఎస్.రమణ తెలిపారు.

దళితులపై దురాహంకారాన్ని బయటపెట్టిన చంద్రబాబు

బొమ్మూరు సెంటర్‌లో చంద్రబాబు వ్యాఖ్యలకు కాగడాలతో నిరసన



బొమ్మూరు సెంటర్‌లో కాగడాల ప్రదర్శన నిర్వహిస్తున్న వైఎస్సార్ టీయూసీ నేతలు

రాజమహేంద్రవరం రూరల్: దళితులపై దురాహంకారాన్ని టీడీపీ అధినేత చంద్రబాబు మరోసారి బయటపెట్టారని వైఎస్సార్ టీయూసీ జిల్లా అధ్యక్షుడు, రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ ముద్దాల తిరుపతిరావు(అను) ఆగ్రహం వ్యక్తం చేశారు. చంద్రబాబు శింగమనల వైఎస్సార్ సీపీ అసెంబ్లీ అభ్యర్థిపై చేసిన వ్యాఖ్యలకు నిరసనగా శనివారం సాయంత్రం బొమ్మూరు సెంటర్‌లో వైఎస్సార్ టీయూసీ ఆధ్వర్యంలో కాగడాల ప్రదర్శన నిర్వహించారు. దళిత యువకుడైన వీరాంజనేయులు ఎంఏ ఎకనామిక్స్, బీఈడీ చదివి ట్రక్కు డ్రైవర్‌గా జీవితాన్ని కొనసాగిస్తున్నాడన్నారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తగా సేవలందిస్తున్న వీరాంజనేయులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శింగమనల ఎమ్మెల్యే అభ్యర్థిగా సీటు ఇచ్చారన్నారు. పేదవాడైన వీరాంజనేయులను అసెంబ్లీకి తీసుకువెళ్లాలన్న ఏకైక లక్ష్యంతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అసెంబ్లీ సీటు ఇచ్చి ప్రోత్సాహిస్తే దీన్ని చూసి తట్టుకోలేని చంద్రబాబు టిప్పర్‌డ్రైవర్‌కు సీటు ఇచ్చారంటూ, వేలిముద్ర వేసేవాడంటూ అవహేళన చేస్తూ మాట్లాడడం దళితులు, పేదవారిపై ఆయనకు ఉన్న అక్కసును వెళ్లగక్కారన్నారు. గతంలో కూడా చంద్రబాబు దళితుల కులంలో ఎవరైనా పుట్టాలనుకుంటారా అని తన కుల అహంకారాన్ని చాటారని ముద్దాల అను అన్నారు. ఇలాంటి వ్యాఖ్యలు చేస్తున్న చంద్రబాబు కూటమిని డ్రైవర్లు, దళితులు, బీసీలు, మైనార్టీలు అందరూ చిత్తుగా ఓడించాలని ముద్దాల అను పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సాంస్కృతిక విభాగం రీజినల్ కోఆర్డినేటర్ నాగులపల్లి ఆశ, మండల ప్రధాన కార్యదర్శి ఎనుముల త్యాగరాజు, మాజీ ఉపసర్పంచ్ దాకే శ్రీనివాస్, జిల్లా దివ్యాంగుల సెల్ అధ్యక్షులు ముత్యాల పోసి కుమార్, రాజమండ్రి సిటీ లీగల్ సెల్ అధ్యక్షుడు సుమన్ పాల్, జీపీఆర్ జెడ్పీ హైస్కూల్ పేరెంట్స్ కమిటీ చైర్మన్ కాకులపాటి కుమార్, సచివాలయ కన్వీనర్, పార్టీ నాయకులు మేడపాటి సద్గుణ రామారెడ్డి, ఎస్.కె.సమీరా, వెంకటలక్ష్మి, అక్కుమహంతి శ్రీనివాస్, రాజమండ్రి రూరల్ ట్రేడ్ యూనియన్ కన్వీనర్ బర్రి కామేశ్వరరావు నిమ్మన నాగేశ్వరరావు, కుడిపూడి వీరంశెట్టి, విశ్వనాథ్, బందిల మణి, కనక మహాలక్ష్మి సత్తార్ బీమ్ తదితరులు పాల్గొన్నారు.

మత సామరస్యాన్ని నాశనం చేయడమే బీజేపీ లక్ష్యం

సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ



సమావేశంలో మాట్లాడుతున్న వనజ

ప్రకాశంనగర్: దేశంలో మత సామరస్యాన్ని నాశనం చేయడమే బీజేపీ లక్ష్యమని, పౌరసత్వ సవరణ చట్టం సీఏఏ అమలు కోసం రాజ్యాంగ నిబంధనను తుంగలో తొక్కిందని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ విమర్శించారు. శనివారం స్థానిక సీపీఐ కార్యాలయంలో సీఏఏ పౌరసత్వ సవరణ చట్టాన్ని రద్దు చేయాలని, లౌకిక భారత రాజ్యాంగాన్ని కాపాడాలనే అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి సీపీఎం జిల్లా కార్యదర్శి టి.అరుణ్ అధ్యక్షత వహించగా, సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం 2019లో చేసిన పౌరసత్వ సవరణ చట్టాన్ని, వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో లబ్ధి పొందడం కోసం ఇప్పుడు అమలు చేస్తోందని ఆమె విమర్శించారు. ఈ చట్టం దేశంలోనే ప్రజలను మతాల వారీగా విడగొడుతుందని, కుల, మత, ప్రాంతీయ, భాష, వేదాలకు అతీతంగా దేశ పౌరులందరూ చట్టం ముందు సమానమేనని చెబుతున్న భారత రాజ్యాంగానికి విరుద్ధంగా ఈ సవరణ ఉందన్నారు. ఈ సీఏఏ చట్టం దేశాన్ని బలహీనపరుస్తుందన్నారు. మత ఘర్షణలు వస్తాయని ఆందోళన వ్యక్తం చేశారు. సీపీఎం జిల్లా కార్యదర్శి టి.అరుణ్ మాట్లాడుతూ పౌరులందరికీ సమాన హక్కులు కల్పించాలనే రాజ్యాంగం నిబంధాన్ని బీజేపీ తుంగలో తొక్కుతోందనే అంశంపై ఈ నెల 6న ఇదే అంశంపై సీపీఎం ఆధ్వర్యంలో సదస్సు, ప్రదర్శన నిర్వహిస్తున్నామన్నారు. సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా నాయకులు చీకట్ల వెంకటేశ్వరరావు, కె.జోజి, జిల్లా కార్యదర్శి తాటిపాక మధు, పార్టీ ఉపాధ్యక్షుడు సత్యనారాయణ, ఏఐటీయూసీ జిల్లా కన్వీనర్ కుండ్రపు రాంబాబు, యునైటెడ్ డెమోక్రటిక్ ఫోరం కన్వీనర్ జహంగీర్ తదితరులు పాల్గొన్నారు.